# ఉద్యోగి

**"శివశ్రీ"**

రాత్రి ఎనిమిది గంటలయినా మూర్తి ఇంటికి రాకపోవడం శాంతకు అనుమానం కలుగజేసింది. ఏనాడూ ఆఫీసునుండి అంతవరకూ రాకుండా లేడు. పైగా తన ప్రయాణం దగ్గిరకు వస్తూన్న కారణంచేత తనకు తేవలసిన వస్తువులను గురించి పదే పదే ప్రస్తావించటం అతని మనస్సుకు బాధను కల్గించలేదుకదా!

మూర్తి జిల్లా టెక్స్టయిల్ ఆఫీసరు. నెలకు మూడు వందలు దాకా ముడ్తూ ఉన్నా లంచాలు ఏమీ పుచ్చుకోక పోవడంవల్ల సంసారం నెగ్గడం చాలా కష్టంగా ఉంది. తన కళ్ళముందు ఎంతో మంది ఉద్యోగులు లంచాలు పుచ్చుకోడంవల్ల చాలా ఆస్తి సంపాదించడం చూస్తూనే ఉన్నాడు. అయినా సిద్ధాంతానికి కట్టుబడి ఉండటంవల్ల అతను ఎవర్నీ దగ్గరకు రానీయడంలేదు. ఈపద్ధతి అవలంబించడంవల్ల మూర్తిని పొగడినవళ్ళూ ఉన్నారు, నిరసించినవాళ్ళూ ఉన్నారు. నిరసించినవాళ్ళే ఎక్కువేమో. ఎందుకంటే నాలుగు రూపాయలు పోయినా పని జరుగుతుందనే నమ్మకం ఉంది.

మూర్తి జీతం చాలక పోవడంవల్ల ఖర్చు తగ్గించుకోవాలనుకున్నాడు కొన్నాళ్ళు. 'పిండి కొద్దీ రొట్టె' అని చిన్ననాడు చదివిన సామెతను అమలు పరుప చూశాడు. కాని చేత కాలేదు. ఎంగులో తగ్గించగలడు? తన ఉద్యోగానికి సరిపోయిన హోదా ఇంటా బయటా లేకుంటే వీల్లేదనే మనిషి అతను.

భార్యను మూడు రోజుల్లో పురుటికి పుట్టింటికి పంపించాలి. ఆవిడకు తన ఉద్యోగ కాలంలో ఒక్క నగయినా చేయించి పెట్టలేదు సరిగదా, చేయించి పెట్టమని మామగారు ఇచ్చిన వెయ్యిరూపాయలు గుటకాయి స్వాహా చేశాడు. ఆ నాటి ఉదయం తాను ఆఫీసుకు బయలుదేరే ముందు భార్య తాంబూలం అందిస్తూ 'నాకు కావలసిన వస్తువులన్నీ సమకూర్చలేకపోతే పోయారు. కనీసం మెళ్ళో గొలుసుకు అతుకు వేయించడం, పెరిగిపోయిన నల్లపూసలకు తీగ చుట్టించడం, పాప, చేతులకు మురుగులు చేయించడం, రెండు చీరలు నాకు నాలుగు గౌనులు పాపకు సమకూరేట్టుగా చూడండి' అని చెప్పిన మాటలు తన చెవిలో మారు మ్రోగుతూండడం చేతే ఏమీ నిర్ణయం చేయలేని స్థితిలో బీచ్ ఒడ్డున ఆ రోజున ఎనిమిది గంటలదాకా ఉన్నాడు.

సుబ్బరాజు ఆనాడు తనకు ఇవ్వబోయిన వెయ్యి రూపాయల లంచం కటిక్కున పుచ్చుకున్నట్లయితే ఈ బాధంతా తీరిపోయేనా? నిరాకరించాడు. ఎవరికో ఒకరికి ఆ పదివేల రూపాయల కోటా వెయ్యవలసిందేనాయె. అదే సుబ్బయ్యకు వేస్తే వెయ్యి రూపాయలు వచ్చేవా? అంగులో సుబ్బయ్య వట్టి పిరికి పంద. ఎదురు వ్యవహారం నడిపించే ధైర్యంలేని మనిషాయె.

భార్యకోరిన వేమీ లేకుండా పుట్టింటికి పంపడం భార్య ఒక్కతెకు కాకుండా తనకూ తలవంపులే. జిల్లా ఉద్యోగి అయి ఉండి భార్య మెడలోని పుస్తెలతాటిని కట్టించలేని ఉద్యోగి ఏం ఉద్యోగి?

తన మనోవ్యథను భార్యకు తెల్పి ఆవిడనుకూడా బాధించడం అతనికి ఇష్టంలేదు. అందుకని ఆ రాత్రి వచ్చిరావడంతోటే వెధవ ఉద్యోగం ఎప్పుడూ ఎవడో ఒకడు రావడం ఆలెక్కలు తియ్యి, ఈ లెక్కలు తియ్యి అనడం. వంగినవాడ్ని మరీ వంచుతారు...' అని తన ఆలస్యానికి కారణం ఎవరో పై అధికారి రావడం అనిశాంత అనుకునేటట్లు ప్రవర్తించాడు.

అయినా శాంత మూర్తి చికాకుగా ఉన్నట్లు తెలుసుకొని తన విషయం ప్రస్తావించనేలేదు. భర్త మనస్సు కుదటపడేందుకు అనేక శీతలోపచారాలు చేసింది. కాని మూర్తి వ్యథ మాత్రం తగ్గలేదు. శాంతలాంటి భార్య కోరికనా ఒక జిల్లా ఉద్యోగి అయిన భర్త నెరవేర్చ లేనిది!

రాత్రి పదకొండు గంటలయింది. పడుకోబోతూ శాంత ముఖంలోకి చూస్తూ 'శాంతా చెప్పడం మరచా. నీవు ఉదయం చెప్పిన వాటికన్నిటికీ షాపులో ఆర్డర్లిచ్చాను. ఎల్లుండికల్లా అన్నీ సిద్ధం' అన్నాడు. శాంత ముఖం విప్పారడం చూచి మూర్తి సంతోషించాడు.

ఉదయం కాఫీ త్రాగి కుర్చీలో కూర్చుని బ్లిట్జ్ చూస్తూన్న మూర్తి కండ్లు అప్రయత్నంగా ఎడిటర్‌కు పాఠకుడొకడు వేసిన ప్రశ్నవైపు పోయింది.

'ఎడిటర్ జీ డబ్బు బాగా సంపాదించాలంటే ఏం చెయ్యాలి?

'నీతి నియమాలు ఒదలాలి.'

నిజం కూడా అంతే. కలికాలంలో అవినీతికి ఉన్నంత విలువ నీతికి లేదు. నీతివంతంగా ఇన్నాళ్లు పనిచేసిన మూర్తికి ఎట్టి ప్రమోషన్ లేదు. అవినీతిపరుడై, లంచగొండైనా సూర్యం అప్పుడే పై ఆఫీసరై కూర్చున్నాడు.

శాంత ప్రయాణానికి ఏర్పాటులు అన్నీ జరిగిపోయినాయి. కాని శాంతకు మాత్రం మూర్తి డబ్బు ఎట్లా తేగలడా అనే సంశయం మాత్రం పోలేదు. తన కొరకు అవినీతిపరుడు కాడుగదా? అట్లా అనుకోనేందుకు మూర్తి విషయంలో వీల్లేదు. కాని భర్త ముఖంలో అప్పుడప్పుడు కన్పించే ఆవేద చిహ్నాలకు మాత్రం అర్థం చెప్పుకోలేక పోయింది. విషయం తెల్సుకుందామనే తలంపుతో మామూలు ప్రకారం భోజనానంతరం దినపత్రిక చదివి వినిపించి అందులో లేని విషయాన్ని ఓదాన్ని ఉన్నట్టుగా చదివింది. సారాంశం దూరదేశంలో ఒ టెక్స్టయిల్ ఆఫీసరు లంచం పుచ్చుకొన్నందుకు బర్తరఫ్ అయినట్లు. మూర్తి 'అవవలసిందే. బర్తరఫే కాదు మరణశిక్ష విధించాలి' అన్నాడు. శాంత అనుమానాన్ని భర్తసమాధానం పటాపంచలు చేసింది.

ఆ నాటి సాయంత్రం సరిగ్గా అయిదు కొట్టేసరికల్లా మూర్తి ఇంటికి రావడం శాంతకు ఆశ్చర్యాన్ని కలుగజేసింది. మూర్తి వెనకాలే వచ్చిన బంట్రోతు శాంత కోరిన వస్తువులను పుచ్చుకురావడం శాంతకు కల్గిన ఆశ్చర్యాన్ని రెండింతలు చేసింది.

మర్నాడు ఉదయం శాంత ప్రయాణం నిర్విఘ్నంగా సాగింది. రెండు నెలలు ఉండి శాంత ఓ చిన్న పాపాయిని ఎత్తుకుని తిరిగి వచ్చింది.

వచ్చిరావడంతోటే మూర్తి ఆజిల్లానుండి ఇంకో జిల్లాకు బదిలీ చేయించుకోవాలని ప్రయత్నిస్తూన్నట్లు విన్నది శాంత. కారణం తెలియలేదు. ఆనాడు మూర్తి గుడ్లు

(19-వ పేజీ చూడండి)

దేళ్లుంటే పదహారేళ్ళని వేయటం కూడా పెద్ద తప్పేనా? ఈ వెధవ అది తగదని నాకు చెప్పొచ్చాడు. తరువాతొకసారి నలుగురి పెద్దమనుష్యుల్లో ఏదో రిక్షావాణ్ణి కొట్టావని-నాతో సూటిగా 'నీదే తప్పు. ఇంకెప్పుడూ తొందరపడబోకండి' అంటాడు? పిల్లొచ్చి గుడ్డును వెక్కిరించిందట. అని ఇంకా ఏవేవో చాలా చెప్పాడు. చివరికి ఎందులో చూచినా నాకు పాప మా ఉపాధ్యాయుని తప్పేమీ కనపడటం లేదు. న్యాయంగా వుండా లంటాడులాగుంది. అంతే చివరికి ఆవూరి పెద్దలనబడేవాళ్ళంతా ఆయనమీద కత్తికట్టి రోడ్డుమీద నుండి వెడుతుంటే "పిచ్చాడు" అని అనిపించీ అనేకవిధాలుగా గోలచేశారట.

ఆయన మాత్రము తనతో యెవరైనా ఈ విషయాలు ప్రస్తావిస్తే "ఆ, ఏదో, పిచ్చాళ్లు ఇప్పుడేదో ఈ విధంగా ప్రవర్తించి బావుకుందా మనుకుంటున్నారు గాని, నిజంగా అదే వారి పతనానికి దారితీస్తుందని తెలియదు, పిచ్చివాళ్లు" అంటాడు.

'ఇప్పుడు నాకొక అనుమాన మొచ్చింది అతన్ని కాదన్న ఆ వూరివాళ్లది పిచ్చా? వాళ్లని కాదన్న అతనిది పిచ్చా?' అని నేనంటే

"వాళ్ళ విషయం అటుంచి ముందు నీది పిచ్చి. విషయం అరటిపండు వొలిచి పెట్టినట్లుగా వుంటే ఇంకా అడుగుతావేమిటి? న్యాయంకోసం పోట్లాడేవాడ్ని పిచ్చివాడ్నిగా జమకట్టటం లోకానికి కొత్తా" అన్న ప్రసాద్ మాటలు నాకు నిజమే ననిపించాయి.

---

# ఉద్యోగి

(11-వ పేజీ తరువాయి)

సర్దుతుంటే శాంతకు మూర్తి పెట్టెలో ఉద్యోగానికి మూర్తి పెట్టుకున్న రాజీనామా కాగితం కన్పించింది. రాజీనామా? కారణం?

భర్తరాకకై ఆ నాడు ఎదురుచూసీచూసీ కండ్లు చిల్లులు పడ్డాయి శాంతకు. భర్త వచ్చీరావడంతోటే తన సంశయాలను గురించి ప్రశ్నల వర్షం కురిపించింది.

శాంత వెళ్ళిన రోజుకు రెండు రోజులకు పూర్వం సుబ్బయ్యవద్ద లంచం పుచ్చుకుని శాంత కోరికలను మూర్తి తీర్చినట్లు, సుబ్బయ్య పని పూర్తయిన తరువాత మూర్తి లంచగొండిఅని ప్రచారం మొదలు పెట్టినట్లు, చివరకు ఆ జిల్లానుండి శాసన సభకు జరిగిన బై ఎలక్షన్ సందర్భంలో ఏర్పరుపబడిన బహిరంగ సభలో ఆఫీసర్ల లంచగొండితనం గూర్చి మాట్లాడుతూ సుబ్బయ్య తన్ని గనుక శాసనసభకు పంపిస్తే లంచగొండి ఉద్యోగులను బర్తరఫ్ చేయిస్తానని, ముందుగా మూర్తిని చేయిస్తానని సవాల్ చేసినట్లు, మూర్తి సుబ్బయ్యకు ప్రజల్లోను, మంత్రుల్లోనుగల పలుకుబడిని చూసి భయపడి సుబ్బయ్య గెలిస్తే రాజీనామా ఇవ్వటానికి నిర్ణయించుకొన్నట్లూ, నిర్ణయించుకోవడమే కాకుండా రాజీనామా ప్రతిని తయారుచేసి యుంచినట్లూ, కాని సుబ్బయ్య గెలవకపోగా డిపాజిట్ కూడా కోల్పోయినందుకు తన రాజీనామాను దాఖలు చేయనట్లు నీతిపరుడై ఋజుమార్గాన నడుస్తున్న తన్ని గురించి సుబ్బయ్య ఆ జిల్లాలో ప్రచారం చెయ్యడంవల్ల మరో జిల్లాకు బదిలీకి ప్రయత్నిస్తున్నట్లు మూర్తి శాంతకు తెలియపరచాడు.

ధైర్యం చెయ్య లేనివాడు ఒక్కసారి ధైర్యం చేసినందుకూ, దానికే కొండంత నిందను సంపాదించుకొన్నందుకు మూర్తి హృదయ భారంతో తలవంచాడు. మూర్తి ఆవేదన, బాధ, అపఖ్యాతికి కారకురాలైనందుకు శాంత తల కూడా ఒంగిపోయింది.

★


## గానకళా బోధిని

వెలువడినది! అపూర్వ సంగీతగ్రంథము వెలువడినది!

By Mr. & Mrs. N. C Parthasarathy

సంగీతమును ప్రారంభమునుండి రాగాలాపనలు, కల్పనస్వరముల వరకు నేర్చుకొన వారికిని, లోయర్, హైయ్యర్ గ్రేడ్ పరీక్షలకు పోవు విద్యార్థులకు శాస్త్రము. ప్రాక్టికల్ గ్రాపులతోను పథకములతోను విపులముగా వ్రాయబడినది. $8\frac{1}{2} \times 5\frac{1}{2}$ (డెమ్మి 1/8) సైజులో 750 పేజిలు గల పుస్తకము. గ్లేజు కాగితముపై ముద్రింపబడిన పూర్తి క్యాలికో బైండు పుస్తకము వెల రు. 10/-లు. పోస్టేజి ప్రత్యేకము. అడ్వాన్సుతోపాటు ఆర్డరు పంపేది.

బాలసరస్వతీ బుక్ డిపో, పి. బి. నెం. 3, కర్నూలు.

మరియు

వెంకటరాం అండ్ కో, పబ్లిషర్సు అండ్ బుక్ సెలర్సు,

అన్ని బ్రాంచీలలోను. హిగిన్ బాదమ్సు అన్ని స్టాల్సులోను దొరకును.



★ పరిశీలన ★

కుష్ఠు "అమృత ఫార్మశీ" మందులు బొల్లి

వేలాదిరోగులు వాడుటకుగల ముఖ్యకారణాలు

* స్వంత లేబరేటరీలో శాస్త్రీయముగామందులు తయారై సత్వర గుణమిచ్చుట.
* మందులన్నియు కేవలము వనమూలికల సారాంశమే అగుటవలన తినుటకు హితవుగా, రుచికరముగానుండుట.
* పేదసాదలకు అందుబాటులో నుండులాగున స్వల్పధరలకే మందులందజేయుట.

అమృత ఫార్మశీ,

చర్మరోగ చికిత్సాలయము

హెడ్డాఫీసు: మారుటేరు, పశ్చిమ గోదావరి జిల్లా.

బ్రాంచి: రాజమండ్రి, గోదావరిస్టేషనుకుఎదురుగా